సాక్షి శ్రీకాకుళం
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



గిరి రైతుకు ప్రోత్సాహం

గిరిజన రైతులకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది. రాయితీపై యంత్ర పరికరాల పంపిణీ చేస్తోంది. - 8లో



దాతలే దిక్కు..!

యలమంచిలికి చెందిన గోవిందరావుకు కిడ్నీలు పాడయ్యాయి. దాతలు స్పందించి తన కుమారుడికి ప్రాణ భిక్ష పెట్టాలని తల్లి వేడుకుంటోంది. - 8లో

సవర సోర్లిగాంలో పులి!

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస పంచాయతీ సవర సోర్లిగాం పరిసర ప్రాంతాల్లో పులి పాదముద్రలను గ్రామస్తులు గుర్తించారు. నిన్నమొన్నటి వరకు మేఘవరం పంచాయతీ పరిధి జక్రపేట సమీపంలో సంచరించిన పులి ఇప్పుడు సవర సోర్లిగాం వైపు రావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

న్యూస్‌రీల్

దళారులను దరి చేరనివ్వొద్దు



మాట్లాడుతున్న జేసీ నవీన్‌కుమార్. పక్కనే సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

టెక్కలి: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా దళారులను దరి చేరనీయవద్దని, అధికారులంతా రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై గురువారం టెక్కలిలో నియోజకవర్గ స్థాయిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుపై రైతులకు ముందస్తుగా సమాచారం అందజేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసిన రైతుల పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లు వద్ద కస్టోడియన్ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణా చేసే వాహనానికి పక్కాగా జీపీఎస్ పరికరాలు అమర్చాలన్నారు. దళారుల ద్వారా వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయవద్దన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, డీఎస్‌ఓ వెంకటరమణ, వ్యవసాయ శాఖ ఏడీ బి.వి.తిరుమలరావు, తహసీల్దారు కె.ప్రవల్లికప్రియ, వ్యవసాయాధికారి రంగారావు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పాలన భేష్



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన వైద్య, రీసెర్చ్ బృందాలు

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పనితీరు అద్భుతంగా ఉందని మిల్లెట్ ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్(ఎన్ఐహెచ్ఆర్) ప్రొఫెసర్ క్రిస్టోఫర్, కింగ్ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ (అమెరికా) బృంద సభ్యులు కొనియాడారు. వజ్రపుకొత్తూరులో గురువారం పర్యటించి అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారంతో చిన్నారులకు మేలు కలుగుతుందన్నారు. పీహెచ్‌సీలలో జరిగిన నాడు-నేడు పనులు, సీకేడీ(కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు) వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. తృణధాన్యాల వినియోగం మరింత పెరగాలన్నారు. కార్యక్రమంలో బృంద వైద్యులు ప్రవీణ్, డాక్టర్ బాలాజీ గుమ్మడి, ప్రోగ్రాం మేనేజర్ జోసెఫ్ రాజు, ఎం.వి.సత్యనారాయణ, సూర్బి అగర్వాల్, సీకేడీ వైద్యులు దిలీప్, డాక్టర్ సహిభా కోహ్లీ, డాక్టర్ విదిషా శర్మ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ కనిష్క, టి.దుర్యోధన పాల్గొన్నారు.

ముగిసిన కులగణన పైలట్ సర్వే



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలో కులగణన పైలట్ సర్వే గురువారంతో ముగిసింది. రాష్ట్రంలోని ఐదు సచివాలయాల్లో నిర్వహించిన ఈ సర్వేలో ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేపట్టారు. యాప్‌లో లోపాలు, సవరణల కోసం పైలట్ ప్రాజెక్టు నిర్వహించామని జిల్లా మాస్టర్ ట్రైనీ వి.మోహన్ తెలిపారు. శిమ్మపేట, రామచంద్రాపురంలో జరుగుతున్న సర్వేను తహశీల్దార్ జెన్ని రామారావు, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, సెక్రటరీ ఎం.రాము పరిశీలించారు.

అభిప్రాయ సేకరణ నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో కులగణనపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ఇ.అనురాధ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని బృందావనం ఫంక్షన్ హాల్లో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీలు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఎస్సీ ఎస్టీ బీసీ ఓసీ మైనారిటీ తదితర సంఘాల నాయకులు, మేధావులు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు హాజరై అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. సామాజికంగా, విద్యాపరంగా సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా రూపొందించేందుకు కులగణన దోహదపడుతుందన్నారు.

సామాన్యులకు అసామాన్య సేవ

- జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 2,67,800 మందికి వైద్య సేవలు
- జిల్లాలో 637 వైద్య శిబిరాల నిర్వహణ
- సేవలు అందించిన 233 మంది స్పెషలిస్టు వైద్యులు
- 45,375 మందికి కంటి సమస్యల స్క్రీనింగ్ పూర్తి
- డిసెంబర్ 31లోగా ఐదో విడత పూర్తి చేసేలా ప్రణాళిక



పెదపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కార్డులను చూపిస్తున్న ప్రజలు (ఫైల్)

అరసవల్లి:

ఒకరు కాదు ఇద్దరు కాదు 233 మంది స్పెషలిస్టు వైద్యులు.. పది కాదు ఇరవై కాదు 637 వైద్య శిబిరాలు.. వెయ్యి కాదు లక్ష కాదు 2,67,800 మందికి వైద్య సేవలు అందజేశారు. సామాన్యుడు కలలో కూడా ఊహించని అంకెలివి. జగనన్న ఆరోగ్య సురక్ష దాదాపు అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించింది. సామాన్యుడికి అసామాన్య రీతిలో వైద్య సేవలు అందజేసింది. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందడమే సగటు జీవులు కష్టతరం అని భావిస్తున్న రోజుల్లో నిపుణులైన వైద్యులను ఊరూరికీ పంపించి జనాలకు వైద్య సేవలు అందించింది.

ఈ ఏడాది సెప్టెంబర్ 16న మొదటి విడతగా ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈనెల 6వ తేదీతో నాలుగో విడతలు పూర్తి చేసుకుంది. ఈ వైద్య శిబిరాలకు హాజరైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించడమే కాదు 5217 మందికి మెరుగైన వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. అలాగే మరో 45,375 మందికి ఉచితంగా క్యాటరాక్ట్ పరీక్షలు నిర్వహించగా.. ఇందులో 2600 మందికి కంటి ఆపరేషన్ల కోసం రిఫర్ చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జేఏఎస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ప్రసాదరావుల ఆధ్వర్యంలో మొత్తం 233 మంది స్పెషలిస్టు వైద్యుల పర్యవేక్షణలో 637 హెల్త్ క్యాంపులను నిర్వహించారు.

ఏడు రకాల వైద్య పరీక్షలు..172 రకాల మందులు

ఈ ఆరోగ్య శిబిరాల ద్వారా ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి 172 రకాల మందులను ఉచితంగా అందజేశారు. దీంతో లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కోసం ఇంతలా చొరవ చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరే అంటూ కొనియాడుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా జగనన్న ఆరోగ్య సురక్ష-1 ను పూర్తి చేసి, జనవరి 2024 లో జగనన్న ఆరోగ్య సురక్ష-2ను ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. వీటి ద్వారా హెల్త్ క్యాంపుల్లో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. మెరుగైన చికిత్స అవసరమైతే వైద్యులు సమీపంలో ఆస్పత్రికి తరలించి ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైనా ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తారు. రోగులు కోలుకునే వరకు పర్యవేక్షించేలా ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్‌లతో అనుసంధానం చేశారు.



రోగి ప్రయాణ ఖర్చుగా రూ.500

ఈ ఏడాది సెప్టెంబర్ 16న గడప గడపకూ వలంటీరు ముందుగా వెళ్లి గుర్తించడంతో మొదటి విడత ప్రారంభించగా..15 రోజుల పాటు ఈ కార్యక్రమం జరిగింది. రెండో విడతగా వలంటీర్లు వెళ్లిన ఇంటికే ఎఎన్ఎం/ సీహెచ్‌ఓ బృందం వెళ్లి రోగులను పరిశీలించి, హెల్త్ క్యాంపులకు వచ్చే వారిని గుర్తించి, టోకెన్లు ఇచ్చారు. అలాగే మూడో విడతగా మళ్లీ ఇంటింటికీ వలంటీర్ వెళ్లి హెల్త్ క్యాంపు నిర్వహణ వివరాలు తెలియజేశారు. ఇక నాలుగో విడతగా జిల్లాలో 637 వరకు హెల్త్ క్యాంపులను స్పెషలిస్టు వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించి లక్షలాది మందికి ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలను, మందులను ఉచితంగా అందజేయడం, మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేయడం జరిగింది. ఈ ప్రక్రియ ఈనెల 6తో ముగిసింది. ఐదో విడతగా రిఫరల్ పేషెంట్లను హ్యాండ్ హోల్డింగ్ (చేయి పట్టుకుని తీసుకెళ్లడం) పేరిట ఒక్కో రోగికి రూ. 500 ప్రయాణ ఖర్చుగా ఇస్తూ నెట్‌వర్క్ ఆస్పత్రులకు మెరుగైన వైద్యానికి, అవసరమైన వారికి ఆపరేషన్లు, కంటి ఆపరేషన్లు చేయించే బాధ్యత తీసుకుంటారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 31లోగా పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు.



ఈయన పేరు రత్నాల సింహాచలం, బొత్తాడసింగి గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం. ఈయనకు కొన్ని నెలలుగా కంటి చూపు తగ్గింది. తలనొప్పి తరచూ వస్తోంది. ఆర్ఎంపీకి చూపించుకునే వారు. ఊరిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వస్తుందని సర్పంచ్ చెప్పడంతో ఆ శిబిరానికి వెళ్లారు. డాక్టర్‌కు తన సమస్యను తెలియజేశారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి డాక్టర్ కె.సంతోషి తగిన మందులు ఉచితంగా ఇచ్చారు. కంటి అద్దాలు కూడా ఇస్తామన్నారు. ఉచితంగా ఇంత మంచి సేవలు అందించడంతో సింహాచలం ఆనందం వ్యక్తం చేశారు.

ఇదో అద్భుతం



ఇంతవరకు ప్రభుత్వ వైద్యుల దగ్గరకు వచ్చిన వారికే వైద్య సేవలు, మందులు అందే పరిస్థితులుండేవి. ఇప్పుడు నేరుగా గడప గడపకు ప్రభుత్వ వైద్యం అందడంతో లక్షలాది మంది రోగులకు మేలు కలిగేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. వైద్య వృత్తిలో ఈ పథకం అద్భుతమనే చెప్పాలి. జిల్లాలో మొత్తం 637 వైద్య క్యాంపుల్లో మంచి స్పందన లభించింది. రిఫర్ చేసిన రోగులకు చేయి పట్టుకుని తీసుకెళ్లేలా ఐదో విడత డిజైన్ చేశారు. ప్రస్తుతం ఇదే పనిలో ఉన్నాం. డిసెంబర్ 31 నాటికి రిఫరల్ రోగులందరికీ ఆపరేషన్లు పూర్తి చేసేలా చర్యలు చేపడతాం. – డాక్టర్ మీనాక్షి, డీఎంహెచ్‌ఓ



కంచిలిలో నిర్వహించిన వైద్య శిబిరంలో.. (ఫైల్)

ఖరీదైన సేవలు ఉచితంగా పొందాను



నేను చాలాకాలంగా కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నాను. మా ఊరిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని వలంటీర్ చెబితే ఆశ కార్యకర్త, వలంటీర్ సహకారంతో వెళ్లాను. కీళ్ల నొప్పులకు మందులు ఉచితంగా ఇచ్చారు. ఇంకా ప్రతి నెల గోవిందపురం పీహెచ్‌సీకి వెళ్లి మందులు తీసుకోవాలని చీటీ రాసి ఇచ్చారు. మందులు బాగా పనిచేస్తున్నాయి. కంటి అద్దాలు కూడా ఇస్తామన్నారు. బయట మందుల షాపుల్లో ఇవే మందులు కొంటే రూ.2వేలు వరకు ఖర్చు, డాక్టర్ ఫీజు, రక్త పరీక్షలకు మరో రూ.5వేలు వరకు అయ్యేవి. కానీ అవన్నీ నాకు ఉచితంగానే లభించాయి. సీఎం జగన్ బాబుకు రుణపడి ఉంటాం.

– గౌడు పాపమ్మ, పొల్లాడ, వజ్రపుకొత్తూరు మండలం

మంచి మందులిచ్చారు



మా గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నేను మా వలంటీరు రాజు చెప్పినట్టు వైద్యుని వద్దకు వెళ్లాను. వివరాలన్నీ అడిగి తెలుసుకున్నారు. నాకున్న నడుపు నొప్పి, కాలు నొప్పి కోసం తెలిపాను. మంచి మందులిచ్చారు. నడుం నొప్పి బాగా తగ్గింది. ఇరవై రోజుల కిందటే వలంటీరు, మా ఊరు ఆశ కార్యకర్త ఇంటికి వచ్చారు. పెద్ద డాక్టరు వస్తారు. తప్పకుండా రా అని చెప్పారు. మళ్లీ ఆ రోజు వచ్చి పిలిచి దగ్గరుండి అన్నీ చూసుకున్నారు. చాలా సంతోషంగా ఉంది. – కింతలి రాజేశ్వరమ్మ, తోనంగి, గార మండలం

ఎప్పుడూ చూడలేదు



జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమం నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. నాకు నోటి నుంచి రక్తం పడింది. ఈ శిబిరంలో డాక్టర్‌కు చెబితే శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి సమస్య ఏమీ లేదని చెప్పారు. రూపాయి ఖర్చు లేకుండా నాకు వైద్యం చేశారు. ఇంటింటా సర్వే ద్వారా సమస్యలను తెలుసుకోవడం ఈ ప్రభుత్వం ప్రజలపై చూపిస్తున్న శ్రద్ధకు నిదర్శనం.

– సీపాన లక్ష్మణరావు, ఫరీదుపేట

త్వరలోనే కొత్త ఓటరు కార్డుల పంపిణీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 1,15,890 నూతన ఓటరు కార్డులను సిద్ధం చేశామని, వాటిని త్వరలోనే పంపిణీ చేస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటి నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, లింగ నిష్పత్తి, ఓటర్ల నమోదు తదితర అంశాలపై విజయవాడ నుంచి ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు ఫారం 6- 8323, ఫారం 7- 2343, ఫారం 8 - 1808 చొప్పున దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని వివరించారు. ఫారం-9, 10, 11, 11ఏ, 11బీలకు సంబంధించి అన్నీ పరిష్కరించామని, ప్రతివారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి ప్రగతి వివరిస్తున్నామని చెప్పారు. ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 18 ఏళ్ల నిండిన వారిని ఓటర్లుగా చేర్పించే కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్డీఓ సీహెచ్.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

23న పలాసకు సీఎం జగన్ రాక




ముఖ్యనేతలతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న పలాసకు రానున్నారని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం నియోజకవర్గ ముఖ్యనేతలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, డాక్టర్ వైఎస్ఆర్ సుజలధార వాటర్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభిస్తారని వివరించారు. ముందస్తుగా పలాస నియోజకవర్గ పరిధిలోని మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ముఖ్య నాయకులతో ఈ నెల 17న ప్రత్యేక సన్నాహక సమావేశం క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తామని చెప్పారు. సీఎం పర్యటన విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.

వాసుదేవ వైభవం

ముగ్ధమనోహరుడైన వాసుదేవునికి గురువారం కార్తీకమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం, శ్రీమణవాళ మహామునుల తిరునక్షత్రం కావడంతో సుమారు మూడు గంటల పాటు ప్రధాన అర్చకుడు దాసుకూర్మాచార్యులు, అర్చకస్వాములు వాసుదేవునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. - మందస



నిజరూపధారుడైన శ్రీవాసుదేవుడు



ప్రత్యేక అభిషేకం చేస్తున్న వేదపండితులు, అర్చకులు



స్వామివారికి క్షీరాభిషేకం



దివ్యాలంకృతుడైన వాసుదేవుడు

సంక్షేమ పథం

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, కార్యక్రమాల పట్ల జిల్లా ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గతంలో కాళ్లరిగేలా తిరిగినా జరగని పనులు, మంజూరు కాని పథకాలు నేడు ఇంటికే వచ్చి చేరుతుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

-పొందూరు/నరసన్నపేట

పథకం: నాడు-నేడు

మెరుగైన విద్య



మాపాప కృపాలి తాడివలస ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేయడంతో కుమార్తెకు మెరుగైన విద్య అందుతోంది. మన బడి నాడు-నేడు సంస్కరణలు, ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ విధానం అమలు చేసి ఎంతో మేలు చేశారు. ఉపాధ్యాయులు నిర్దేశిత సమయానికి పాఠశాలకు వచ్చి పాఠాలు బోధిస్తున్నారు.

– తమ్మినైన బాలకృష్ణ, విద్యార్థిని తండ్రి, తాడివలస, పొందూరు మండలం

పథకం: పేదలందరికీ ఇళ్లు

అద్దె ఇంటి కష్టాలు తీరాయి..



ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి ఉన్న ఇళ్లు అమ్ముకున్నాం. అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. సెంటు భూమి లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సొంతింటిని సంపాదించుకున్నాం. నేను, భర్త, కొడుకు, కోడలు, మనవళ్లు అందరం కలిసి ఉంటున్నాం. చాలా సంతోషంగా ఉన్నాం. జగన్ నాబిడ్డతో సమానం. – సీపాన లలిత, ఇంటి లబ్ధిదారు, తాడివలస, పొందూరు మండలం

పథకం: జగనన్న సురక్ష

కుల ధ్రువీకరణ పత్రం అందింది



నేను వ్యవసాయ కూలీని. పనికి వెళ్లకపోతే పూట గడవదు. అలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ చేయూత పథకానికి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ అవసరం పడింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ ఇంటికే తెచ్చి కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. గతంలో ఇలాంటి సర్టిఫికెట్లు కావాలంటే వ్యయప్రయాలకు గురయ్యేవాళ్లం. ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా ఇంటికే వచ్చి సర్టిఫికెట్లు అందించారు.

– టెంక లక్ష్మి, జమ్ము, నరసన్నపేట మండలం

రేషన్ సమస్య పరిష్కారమైంది



మా పెద్దబ్బాయికి వివాహమైంది. ఉద్యోగ నేపథ్యంలో వేరే చోట ఉన్నా ఒకే రేషన్ కార్డులో అందరి పేర్లు ఉండడంతో సంక్షేమ పథకాలు అందేవి కావు. ఎనిమిదేళ్లుగా రేషన్ సరుకులు అందడం లేదు. జగనన్న సురక్ష పథకంలో సమస్య విన్నవించడంతో పరిష్కారమైంది. ప్రస్తుతం రేషన్ వస్తోంది. రైతు భరోసాకు కూడా దరఖాస్తు చేసుకున్నాం.

– నల్లి బందారి, రైతు, పొందూరు

19న జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల ఖోఖో జట్ల ఎంపికలు ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా ఆదివారం ఉదయం 9 నుంచి ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. ఎంపికైన జిల్లా జట్లను డిసెంబర్ 8 నుంచి 10 వరకు ప్రకాశం జిల్లా మార్కాపురం వేదికగా జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరై జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నీలాద్రిరావు వద్ద రిపోర్ట్ చేయాలని కోరారు.

క్లుప్తంగా

సచివాలయ సేవలపై ఆరా



చేదోడు యూనిట్‌ను పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని అరసవల్లి వార్డు సచివాలయాన్ని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ బుధవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏర్పాటైన దుకాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

క్యాజూ మార్కెటింగ్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎంబీఏ ప్రొఫెసర్ కె.వేణుగోపాల్, గరుడభద్ర మహేంద్రా క్యాజూ ఇండస్ట్రీ ఎండీ కె.సందీప్‌లు సంయుక్తంగా రచించిన 'క్యాజూ మార్కెటింగ్' పుస్తకాన్ని గురువారం కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. పలాస జీడి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిలో విక్రయించేందుకు గల అవకాశాలపై ఈ పుస్తకంలో తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. జీడి పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ బి.వి.రమణ, హెచ్‌ఓడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇంగ్లిష్ శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ బగాది శాంతిశ్రీ

కోటబొమ్మాళి: జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇంగ్లిష్ భాషపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఐసీడీఎస్ పీడీ బగాది శాంతిశ్రీ తెలిపారు. గురువారం కోటబొమ్మాళి ఐసీడీఎస్ కార్యాలయంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో పిల్లలకు విద్యా బోధన ఇంగ్లిష్‌తో ముడిపడి ఉన్నందున ప్రతి కార్యకర్త భాషపై పట్టు సాధించాలన్నారు. శిక్షణకు సంబంధించి ఐసీడీఎస్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ చింతాడ హైమావతి, ఏసీడీపీఓ రూపలత, సూపర్‌వైజర్లు సత్యప్రియ, పద్మలత, మనోహరి, ఉషశ్రీ, పద్మావతి, రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.


జాతీయ తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: మండల కేంద్రంలోని ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల కడపలో జరిగిన 67వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించి బంగారు, రజత పతకాలను కైవసం చేసుకొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్ఎం ఎస్.విశ్వనాథం తెలిపారు. ఈ సందర్భంగా ఆశి రేవంత్(స్వర్ణం), సీహెచ్ గిరి(స్వర్ణం), ఎస్.జయరామ్(రజతం)లను గురువారం అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు టి.గణేష్, శారద, ఉపాధ్యాయులు జోగేశ్వరరావు, సూర్యం, చంద్రశేఖర్, తైక్వాండో కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టాలీ కోర్సుతో ఉపాధి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: టాలీ కోర్సు నేర్చుకున్న వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. గురువారం వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో టాలీ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్యాక్స్ కన్సల్టెన్సీ టి.బాలాజీ, కామర్స్ హెచ్‌ఓడీ లబ్బ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, కుమారస్వామి, లెక్చరర్లు కె.లలితాభాయ్, బి.సంతోషి, యు. పావని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరి రైతుకు ప్రోత్సాహం



పవర్ టిల్లర్ యంత్రం

- రాయితీపై యంత్ర పరికరాల పంపిణీ
- రూ.2.11 కోట్లతో ఐదు రకాల యంత్రాలు సిద్ధం
- ఐటీడీఏ పరిధిలో 16 మండలాల్లో గిరిజన రైతుల గుర్తింపు

టెక్కలి: వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న జగనన్న సర్కారు గిరి రైతులను ప్రోత్సహించేందుకు మరో ముందడుగు వేసింది. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రైతులకు చేయూతగా నిలిచి మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గిరిజన రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు సాగును ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో గరిష్టంగా 90 శాతం రాయితీతో 5 రకాల యంత్ర పరికరాలు అందజేసేందుకు ఇప్పటికే రైతుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలో 16 మండలాల్లో గిరిజన రైతులకు వీటిని అందజేయనున్నారు. సుమారు రూ.2,11,88,000 విలువైన యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించనున్నారు. సీతంపేట

యంత్రం	పరికరాల సంఖ్య	రాయితీ
పవర్ వీడర్లు	25	90 శాతం
పవర్ టిల్లర్స్	23	90 శాతం
డీజిల్, పెట్రోల్ ఇంజిన్లు	62	80 శాతం
మినీ ట్రాక్టర్లు	20	60 శాతం
మల్టీ క్రాప్ త్రేషర్స్	10	75 శాతం

ఐటీడీఏ పరిధిలోని బూర్జ, హిరమండలం, కొత్తూరు, సరుబుజ్జిలి, పాతపట్నం, జలుమూరు, కంచిలి, ఎల్.ఎన్.పేట, లావేరు, మందస, మెళియాపుట్టి, టెక్కలి, నందిగాం, పలాస, సారవకోట, సోంపేట తదితర మండలాల్లో గిరిజన రైతులకు ఈ యంత్ర పరికరాలను అందజేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి..



వ్యవసాయం, ఉద్యానవన పంటలను సాగు చేస్తున్న గిరిజన రైతులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం యంత్రాలను రాయితీపై అందజేస్తోంది. గరిష్టంగా 90 శాతం రాయితీతో యంత్రాలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో సుమారు 16 మండలాల్లో గిరిజన రైతులకు లబ్ధి చేకూరనుంది.

– బి.వి.తిరుమలరావు, వ్యవసాయ శాఖ ఏడీ, టెక్కలి

వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: ప్రతి వ్యక్తిని సంపూర్ణ ఆరోగ్యవంతునిగా చూడటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సరుబుజ్జిలి మండలం కొత్తకోట గ్రామంలో రూ.17లక్షల 50వేల అంచనా వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం, రూ.16లక్షల అంచనా నిధులతో నిర్మించిన జగనన్న పాలవెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం నూతన భవనాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి ఇంటికి వైద్యసేవలు కల్పించిన ఘనత ప్రభుత్వానికే దక్కినట్లు తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యసేవల్లో భారీగా ఓపీ పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు జగనన్న పాలవెల్లువ, ఆసరా, చేయూత వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, కొత్తకోట ఎంపీటీసీ సభ్యుడు సురవరపు సింహాచలం, వైస్ ఎంపీపీ లావేటి అనిల్‌కుమార్, మండల పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ అధ్యక్షుడు కావిలాపు చంద్రశేఖర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ, జిల్లా కార్యదర్శి బాన్న రాము, ఎస్సీ సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, పార్టీ నేతలు సురవరపు శిమ్మినాయుడు, బద్రి రామారావు, ఇల్లాకుల సూర్యప్రకాశరరావు, గౌరినాయుడు, యువనేత గండివలస ఉపేంద్ర, ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్ పాల్గొన్నారు.

దాతలే దిక్కు..!

- కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు రూ.15 లక్షలు అవసరం
- కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని తల్లి వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవిందరావు

జలుమూరు: తన కుమారుడిని రక్షించి ఆదుకోవాలని జలుమూరు మండలం యలమంచిలి గ్రామానికి చెందిన చెంచల లక్ష్మి దాతలను వేడుకుంటోంది. ఈమె కుమారుడు గోవిందరావు డిగ్రీ మొదటి ఏడాది చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడు. విశాఖలో ఆస్పత్రికి వెళ్లి చూపించగా కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం విశాఖపట్నంలోనే డయాలసిస్ చేయిస్తున్నారు. కిడ్నీ మార్పిడి జరిగితే బిడ్డ బతుకుతాడని డాక్టర్లు చెప్పడంతో తన కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధమయ్యానని, అయితే కిడ్నీ మార్చేందుకు సుమారు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని తల్లి వాపోయింది. తన భర్త రమణమూర్తి మరణించారని, కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నానని, అంత సొమ్ము సమకూర్చలేనని, దాతలే ముందుకు వచ్చి పుత్రభిక్ష పెట్టాలని వేడుకుంటోంది. ఇప్పటికే గ్రామానికి చెందిన పెద్దలు, యువత, కొందరు ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి సుమారు రూ.1.50 లక్షలు అందించారని, సహాయం చేయదలచిన వారు 9963529769 నంబరుకు ఫోన్‌పే చేయాలని విన్నవించారు.

దొంగలున్నారు జాగ్రత్త..!



ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో వివిధ నేర కార్యకలాపాల్లో ఉన్న కరుడుగట్టిన నేరస్తులు, క్రిమినల్ గ్యాంగుల్లో ఉన్న వ్యక్తుల పేర్లు, ముఖచిత్రాలతో కూడిన పోస్టర్లను, ఫ్లెక్సీలను గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో పోలీసులు ఏర్పాటు చేశారు.

ఇందులో ఉన్న వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా సెంట్రల్ క్రైమ్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.బాబూజీరావు కోరారు. సీసీఎస్ సీఐ 6309990835, అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు 6309990893 నంబర్లకు తెలియజేసి నేరనియంత్రణకు సహకరించాలన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: బాల్య వివాహాలు జరగకుండా అంగన్‌వాడీ సిబ్బందితో పాటు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో ఎ.శోభారాణి అన్నారు. ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు, బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బాలల రక్షణ అధికారులు ఇప్పిలి లక్ష్మీనాయుడు, మెట్ట మల్లేశ్వరరావు, ఓఆర్‌డబ్ల్యూ ఎ.గీత, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ డి.రాజు, సూపర్‌వైజర్లు యశోద, ఉమ, సీతామహాలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్తరాంధ్ర మహిళా సంఘ ప్రతినిధులు

కాశీబుగ్గ: దేశంలో మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు మహిళల ఐక్య పోరాటాలే శరణ్యమని ఉత్తరాంధ్ర మహిళా సంఘం ప్రతినిధులు అన్నారు. మహిళపై దాడులను నిరసిస్తూ గురువారం కాశీబుగ్గలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల సాహిత్యం, వెబ్‌సైట్స్, కొన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే దాడులకు కారణమన్నారు.

బలమైన మహిళా ఉద్యమాలను నిర్మించుకోవడమే మన ముందున్న ఏకైక పరిష్కారమని నినదించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు పి.నాగమణి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, జిల్లా కమిటీ సభ్యులు కుత్తుం హేమమ్మ, బి.జానకి, జ్యోతి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి స్వల్ప గాయాలు

మందస: మండలంలోని మఖరజోల గ్రామ సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. పలాస మండలం రామకృష్ణపురం సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు మందస మండలంలోని విద్యార్థులను తీసుకెళ్తుండగా, ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న డిఫెన్స్ సెక్యూరిటీ స్కార్పియో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ చెప్పారు.



ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు

మార్కెట్‌కు చవితి శోభ

నాగుల చవితి సందర్భంగా జిల్లాలోని పలు మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గురువారం కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఉద్దాన రైతు మార్కెట్‌కు జనం భారీగా తరలివచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేశారు. కలగూర, పూలు, పండ్లు కొనుగోలుకు ఆసక్తి చూపారు. ముఖ్యంగా పుట్టలో వేసేందుకు అవసరమైన నాటు కోడిగుడ్లకు గిరాకీ ఏర్పడింది.

– కాశీబుగ్గ



అరటికాయలు, ఆకులు అమ్ముతున్న మహిళ



నాటుకోడిగుడ్లు అమ్ముతున్న మహిళ



సందడిగా కాశీబుగ్గ ఉద్దాన రైతు మార్కెట్

పూరిల్లు దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న గ్రామస్తులు

పాతపట్నం : మండలంలోని ఆర్.ఎల్.పురం ఎస్టీ వీధిలో పాసి నూకయ్యకు చెందిన పూరిల్లు గురువారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. నూకయ్య, భార్య కాంతమ్మలు కలిసి కొండపై పోడు వ్యవసాయానికి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇంట్లో మంటలు వ్యాపించడంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి మంటలను ఆపే ప్రయత్నం చేశారు. అనంతరం టెక్కలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చారు. అప్పటికే సామాన్లు, దుస్తులు కాలిబూడిదయ్యాయని బాధితులు వాపోయారు. బాధితురాలు కాంతమ్మ మాజీ సర్పంచ్‌గా కూడా సేవలందించారు. రెవెన్యూ సిబ్బంది వివరాలు సేకరించారు.

ఆర్టీసీ బస్సుల్లో గిఫ్ట్ స్కీం



బస్సులో గిఫ్ట్ బాక్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల పరిధిలో పలు రూట్లలో తిరిగే ఆర్టీసీ బస్సుల్లో గిఫ్ట్ స్కీం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్లు పి.మల్లికార్జునరాజు, కె.ఆర్.ఎస్.శర్మ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గురువారం ఆమదాలవలస బస్సులో గిఫ్ట్ స్కీం బాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమదాలవలస, బందరువానిపేట, చీపురుపల్లి, సాలూరు, శ్రీముఖలింగం, గుత్తావల్లి, యరగాం, విజయనగరం తదితర మార్గాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే వారు గమ్యస్థానంలో దిగే ముందు టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని కోరారు. ప్రతి నెలా 3, 17వ తేదీల్లో డ్రా తీసి విజేతలకు జీఎస్‌వీ జ్యువెలర్స్(శ్రీకాకుళం) సౌజన్యంతో ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం కె.నరేంద్ర, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవి జంతువు మాంసం వాటాలు

- 23 మందిపై కేసు నమోదు

పాతపట్నం: అడవి జంతువు మాంసాన్ని వాటాలుగా పంచుకున్న 23 మందిపై కేసు నమోదు చేసినట్లు పాతపట్నం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆర్.రాజశేఖర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పి.యశస్వీ తెలిపారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరగ్గా సాయంత్రం వెలుగులోకి వచ్చింది. గురువారం తెల్లవారు జామున కొండపై నుంచి కొండమేక పెద్దసీది గ్రామంలోకి వచ్చింది. కుక్కలు తరిమిదాడి చేయడంతో కొండమేక మృతి చెందింది. గ్రామానికి చెందిన 24 మంది కొండమేక మాంసాన్ని వాటాలు వేసుకుని పంచుకున్నారు. విషయం పాతపట్నం ఫారెస్ట్ అధికారులకు తెలియడంతో వెంటనే పెద్దసీది ఫారెస్టు సిబ్బంది చేరుకుని నిందితులను గుర్తించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేశారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు దరహాస్



రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో పతకాలు అందుకుంటున్న దరహాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: న్యూఢిల్లీలో త్వరలో జరగనున్న జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం నగరానికి చెందిన వేమకోటి ధనుష్య దరహాస్ ఎంపికయ్యాడు. తిరుపతి వేదికగా నవంబర్ 9 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో మూడు పతకాలు సాధించి శభాష్ అనిపించాడు. రాష్ట్ర పోటీల్లో 50 మీటర్ల ఫ్రీస్టైల్, 50మీటర్ల బటర్‌ఫ్లై విభాగాల్లో బంగారు పతకాలు, 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజత పతకాలు సాధించి మెరిశాడు. దరహాస్ శ్రీకాకుళం ఇల్లీసుపురం సమీపంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్మీడియెట్ సెకెండియర్ చదువుతున్నాడు. ఈ సందర్భంగా దరహాస్‌ను ఏజీఎం నర్సునాయుడు, డీన్ మురళీధర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, డీఎస్ఏ చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, స్విమ్మింగ్ అసోసియేషన్ హారికాప్రసాద్, ఎస్.కాంతారావు, మురళీధర్, కోచ్‌లు, సిబ్బంది అభినందించారు.